క్లుప్తంగా

సుత్తమ్మ తల్లికి ప్రత్యేక అలంకరణ



గాజుల అలంకరణలో చిప్పాడ సుత్తమ్మతల్లి

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ గ్రామదేవత సుత్తమ్మ తల్లిని బుధవారం 15 వేల గాజులతో అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. తగరపువలస మణికంఠ ఫుడ్‌కోర్టు యజమానులు ఆదిమూలం నాగరాజు, సత్యనారాయణ బ్రదర్స్ ఈ అలంకరణకు డజను గాజులకు రూ.30 వంతున 1250 డజన్లకు రూ.37,500 ఆలయ కమిటీకి అందించారు. చిప్పాడ భవానీ పీఠం, సుత్తమ్మతల్లి ఆలయ ప్రతినిధులు ఈ అలంకరణ చేశారు. శ్రావణమాసం సందర్భంగా గాజులతో అలంకరించినట్టు వారు తెలిపారు.

గణపతి నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



మారికవలస ఆర్‌జీకే కాలనీలో ముహూర్తపు రాట వేస్తున్న భక్తులు

మధురవాడ: గణపతి నవరాత్రి ఉత్సవాలకు మధురవాడలో కాలనీలు సిద్ధం అవుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం జీవీఎంసీ 5వ వార్డు మారికవలస ఆర్‌జీకే పాత కాలనీలో గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక పూజలు నిర్వహించి ముహూర్తపు రాట వేశారు. కాలనీలోని 2వ బ్లాకులో పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌ఏఏసీ పరిశీలన

పీఎం పాలెం : నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ (ఎన్‌ఏఏసీ) పునరుద్ధరణ నిమిత్తం స్థానిక సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన సైకిల్ – 2 విజిటింగ్ బుధవారంతో ముగిసింది. ఈ పర్యవేక్షణకు టీమ్ చైర్‌పర్సన్‌గా జమ్మూ కాశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ వై.సంజీవ్ జైన్ హాజరయ్యారు. సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాల నిర్వహణ, పనితీరు, విభాగాల్లోని సెమినార్ హాళ్లు, పరిశోధనశాలలు పరిశీలించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామి, డాక్టర్ ప్రదీప్ బెనర్జీ, సీఓ కన్నా, ఆల్వార్ దాస్ గ్రూప్ డైరెక్టర్ సుంకరి రాహుల్, మధుబట్, నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్ పాల్గొన్నారు.

కృష్ణం వందే జగద్గురుమ్

◆ వేడుకగా శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు



టి.నగరపాలెంలో రాధాకృష్ణుల కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు



తాటితూరు కూడలి వద్ద మండపంలో శ్రీకృష్ణుని విగ్రహం ప్రతిష్ఠించిన స్థానికులు



చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయంలో శ్రీకృష్ణ వేషధారణ పోటీల్లో చిన్నారులు



మద్దిలో శ్రీకృష్ణుని విగ్రహం వద్ద పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసింహరాజు, తదితరులు



మానం ఆంజనేయులు కాలనీలో ఉట్టి సంబరం నిర్వహిస్తున్న భక్తులు

తగరపువలస: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నియోజకవర్గంలో బుధవారం పలుచోట్ల ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని తాటితూరు కూడలిలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార సమితి తరఫున ఆచార్య ప్రబోధానందుని శిష్యులు ఈ నెల 16 వరకు నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా మండపంలో శ్రీకృష్ణుని విగ్రహం ఏర్పాటు చేసి పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధి బోని రావణ అక్షయ్ శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టతను వివరించారు. శ్రీకృష్ణుని దర్శనానంతరం భక్తులకు కృష్ణుని చిత్రపటాలు, త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండపాన్ని సర్పంచ్ శిరిగుడి సంతోషి, ఈశ్వరరావు, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, సర్పంచ్‌లు పాట్నూరు ఛాయాగౌతమి, చంద్రశేఖర్, లచ్చుబుగత జగదీశ్వరరావు, గాడు వెంకటనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, గ్రామపెద్దలు దుంపల ప్రభాకరరావు, ఉండబట్ల వెంకట అప్పారావు, పల్లంటి శ్యామ్‌సుందరరావు, పతివాడ రాంబాబు, గాడు తాతినాయుడు, గురునాయుడు, ఎం.వెంకటరావు, ఆర్.రామకృష్ణ, కొమర రాము పాల్గొన్నారు. వీరికి సమితి ప్రతినిధులు ప్రసాద్, బాలకృష్ణ, నాయుడు, రమణ, గణేష్, జగన్, రాజు తదితరులు ప్రసాదాలు అందించారు.

◆ టి.నగరపాలెంలోని శ్రీకృష్ణుని ఆలయంలో అర్చకుడు పెంట వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వాహకులు రాధాకృష్ణుల కల్యాణం జరిపించారు.

◆ సంగివలస కొత్తమ్మతల్లి ఆలయ ఆవరణలో ఈవో బి.ప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, తమ్మిన కూర్మారావు తదితరులు ఉట్టి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు నరసింహమూర్తి, కోరాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు. స్థానిక భగవద్గీత ప్రచార సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి పల్లకీ సేవ నిర్వహించారు.

◆ చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయంలో ఆనందపురం మండలం గుడిలోవ శ్రీ సరస్వతి విద్యావిహార్ పాఠశాల యాజమాన్యం చిన్నారులకు శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో జాతీయ విద్యా ప్రణాళిక సంఘ సభ్యుడు దూసి రామకృష్ణారావు, సెంట్రల్ సెన్సార్ బోర్డు ఫిల్మ్ సర్టిఫికెట్ సభ్యుడు అయినాడ దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొని భారతదేశ ఔన్నత్యాన్ని వివరించారు. న్యాయ నిర్ణేతలుగా లీలావతి, నందిని, చిల్ల వెంకటరమణ వ్యవహరించారు. ఈ సందర్భంగా సరస్వతి విద్యావిహార్ విద్యార్థులు పాడిన పాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి.

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సాయి రవీంద్ర పాఠశాలలో బుధవారం సాయంత్రం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు బాలకృష్ణుడు, గోపికమ్మ వేషధారణతో అలరించారు. అనంతరం ఉట్టికొట్టి కోలాటం ప్రదర్శించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్ పాల్గొన్నారు.

మద్దిలో ఘనంగా జన్మాష్టమి వేడుకలు

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి విగ్రహాన్ని నిలిపారు. ఈ విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే ఆర్.ఎస్.డి.పి.అప్పలనరసింహరాజు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, భీమునిపట్నం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు బోని సన్యాసినాయుడు దర్శించుకుని పూజలు చేశారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి, ఇందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు జి.కృష్ణ సూరప్పడు, బి.పైడన్న, ఎస్.శ్రీనివాస్, వి.సురేష్, ఎస్.సూర్యనారాయణ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఉట్టి సంబరాలు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలసలో బుధవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్టి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, బోని సన్నిబాబు, ఉప సర్పంచ్ బీఎస్ఎన్ రాజు, చిల్ల హరి, అక్కరమాని అప్పలనాయుడు, దంతులూరి వేణు, అక్కరమాని గంగాధర్ పాల్గొన్నారు.

మధురవాడ: శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు మధురవాడలోని వివిధ ప్రాంతాల్లో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గణేష్‌నగర్, ఐటీ సెజ్ జంక్షన్ వద్ద గల మానం ఆంజనేయులు నగర్‌లోని శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత మహా కామేశ్వర స్వామి ఆలయం, మధురవాడ జంక్షన్‌లోని సిద్ధేశ్వర స్వామి పీఠం, టైలర్స్ కాలనీలోని ఆలయాలతోపాటు నివాస ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించారు. సాయంత్రం గోపాలుడు, గోపిక వేషధారణలో చిన్నారులు, భక్తులు ఉత్సాహంగా ఉట్టి సంబరం జరిపారు. ఆయా కార్యక్రమాల్లో కమిటీ అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్, ప్రతాపరాజు, అర్చకులు దూసి రామలింగశర్మ, శ్రీకాంత్ శర్మ పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని గంభీరంలో ఉన్న హరేకృష్ణ వైకుంఠ మందిరం నిర్మాణ ప్రదేశంలో బుధవారం హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం బాల గోపాలునికి ఉయ్యాల సేవ నిర్వహించారు. అనంతరం 108 సార్లు హరినామ జపం చేసిన భక్తులకు శ్రీకృష్ణ భగవానుడి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఉట్టి మహోత్సవం, కృష్ణుడితో సెల్ఫీ, కృష్ణ భగవానుడు ఎవరు అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. సప్త నదుల జలాలు, పళ్ల రసాలు, పంచామృతాలు, పంచగవ్యాలు, పుష్పాలతో 108 జల కలశాలతో మహాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వెల్లంకిలో బాల గోకులం..

మండలంలోని వెల్లంకిలో గుడిలోవ విజ్ఞాన్ విహార్ ఆధ్వర్యంలో బాలగోకులం నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ వర్గలుగా నిర్వహించిన బాల గోకులంలో 20 మంది చిన్నారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విహార్ అధికారిణి సావిత్రి, బీజేపీ నాయకులు ప్రసాదరావు పట్నాయిక్, ఉప్పాడ అప్పారావు, ఏలూరి ధర్మావతి, ఎంపీటీసీ సభ్యుడు పడాల అప్పలనాయుడు, కంఠిమహంతి శివ ప్రసాద్ పాల్గొన్నారు.



ఆకట్టుకున్న బాల గోపాలుడు



బాల గోపాలుని ఊయల ఊపుతున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్



తాళ్లవలసలో ఉట్టి సంబరాలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



హరేకృష్ణ వైకుంఠ మందిర ప్రదేశంలో శ్రీకృష్ణునికి పూజలు చేస్తున్న భక్తులు



బాల గోకులంలో పాల్గొన్న చిన్నారులు

జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు బ్యాంక్ అకౌంట్లు

మధురవాడ: జీవీఎంసీ 5, 6, 7 వార్డుల పరిధిలో గల జగనన్న ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారులకు అవంతి ఫంక్షన్ హాలు సమీపంలో గల 49వ నంబరు సచివాలయంలో బ్యాంకు అకౌంట్‌లు తెరుస్తారని జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మి చెప్పారు. ఐసీఐసీఐ బ్యాంకు అకౌంట్ తెరచుకోవాలనుకునే లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు బ్యాంకు ద్వారా రుణం పొందాల్సి ఉంటుందని, దానికి బ్యాంకు అకౌంట్ తప్పనిసరి అని చెప్పారు. అందువల్ల హౌసింగ్ లబ్ధిదారులు అంతా తక్షణమే అకౌంట్ తెరచుకోవాలని సూచించారు. అకౌంట్ కోసం వచ్చేవారు వైజేసీ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ అయిన ఎన్‌పీఐ ఐడీ తీసుకురావాలని తెలిపారు. వివరాలకు ఆయా సచివాలయాల పరిధిలోని వలంటీర్లు, సచివాలయ, యూసీడీ విభాగం సిబ్బందిని సంప్రదించాలని జెడ్సీ సూచించారు.

వియత్నాం వర్సిటీతో గీతం ఎంవోయూ

కొమ్మాది: వియత్నాంకు చెందిన హంగ్‌బంగ్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయంతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, హంగ్‌బంగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ అంతర్జాతీయ వ్యవహారాల ఉపాధ్యక్షుడు నయాన్ గాక్‌టాన్ సమక్షంలో బుధవారం అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు.

అధ్యాపకురాలు అనురాధకు డాక్టరేట్



అనురాధకు డాక్టరేట్ అందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

భీమునిపట్నం: భీమిలిలోని ప్రభుత్వ మహిళ పాలిటెక్నిక్ కళాశాల వద్ద సీనియర్ అధ్యాపకురాలిగా సేవలు అందిస్తున్న చల్లా అనురాధకు డాక్టరేట్ లభించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో ప్రొఫెసర్ ఉమాదేవి, ప్రొఫెసర్ కృష్ణమోహన్ పర్యవేక్షణలో ఆమె పని చేశారు. ఈ మేరకు మత్స్యకార రంగంలో సుస్థిర అభివృద్ధి వ్యూహాలు – ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో మహిళా మత్స్యకారుల సాధికారతపై పరిశోధన విజయవంతంగా పూర్తి చేశారు. దీనిపై ఆమెకు డాక్టరేట్ లభించింది. ఏయూ వీసీ పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ఆమెకు పీహెచ్‌డీ ప్రొసీడింగ్ అందజేశారు.

పైడిరాజు సేవలు ఆదర్శనీయం



ఉపాధ్యాయుడు పైడిరాజు దంపతులను సత్కరిస్తున్న మత్స్యకార పెద్దలు

భీమునిపట్నం: పేద మత్స్యకార కుటుంబంలో జన్మించి ప్రభుత్వ ఉపాధ్యాయునిగా ఉత్తమ సేవలు అందిస్తున్న కాసరపు పైడిరాజు సేవలు అందరికీ ఆదర్శనీయమని బోయివీధి మత్స్యకార పెద్దలు అన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన పైడిరాజు దంపతులను బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో చేరినప్పటి నుంచి పిల్లలకు విలువలతో కూడిన విద్య అందిస్తున్నానని తెలిపారు. పెద్దలు కాసరపు దుర్గారావు, కొక్కిరి నూకరాజు, కదిరి ఎల్లాజీ, తెడ్డు రాందాసు, కాసరపు నాగరాజు, కాసరపు పెద ఎల్లాజీ పాల్గొన్నారు.

నవంబర్ 14 నుంచి మహా నారాయణ సేవ



మహా నారాయణ సేవ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అయ్యప్ప సేవా సంఘం సభ్యులు

భీమునిపట్నం: భీమిలి బీచ్ సమీపంలోని వీరాంజనేయ అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 14 నుంచి మహా నారాయణ సేవ ప్రారంభించడానికి నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం సంఘ సభ్యుల సమావేశం అధ్యక్షుడు కొమ్మినేని ఎర్నినాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఇక్కడ ఏటా అయ్యప్ప, భవానీ మాలధారులతోపాటు ఇతర మాలధారులకు మహా నారాయణ సేవ ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా నవంబర్ 14 నుంచి డిసెంబర్ 28 వరకు అన్నప్రసాదం అందించడానికి నిర్ణయించి కరపత్రాలు ఆవిష్కరించారు. సంఘ ప్రధాన కార్యదర్శి మొకర నర్సింగరావు, కోశాధికారి పిల్లి శ్రీను, ఉపాధ్యక్షులు కదిరి జగన్నాథం, ముఖ్య సలహాదారుడు గుగ్గిళ్ల సాయి, సభ్యులు వేణుస్వామి, మధు పంతులు, శ్రీనివాసరావు, నల్లి నర్సింగరావు, కనకల సన్నిబాబు, ప్రగడ చంటి పాల్గొన్నారు.

రేపు ఉచిత సామూహిక శ్రావణలక్ష్మీ పూజలు



సిరులతల్లికి అభిషేకం చేస్తున్న భక్తులు

డాబాగార్డెన్స్: శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 8న ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు అమ్మవారి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తులు పూరించి గురువారం లోగా అందజేయాలి.

నేడు సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. రూ.1,500 పూజా రుసుం చెల్లించి భక్తులు పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తుల వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 89855 15989 నంబర్‌కు వాట్సాప్ చేయాలి.

21వ రోజుకు శ్రావణలక్ష్మి పూజలు..

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు బుధవారం నాటికి 21వ రోజుకు చేరాయి. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సిరులతల్లికి భక్తులు విశేష అభిషేకాలు చేశారు. ఈ పూజల్లో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

హిందీ విద్యార్థులకు హాల్ టిక్కెట్ల పంపిణీ

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచార సభ చెన్నై ఆధ్వర్యంలో ఈ నెల 9, 10న భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్ కేంద్రంగా నిర్వహించనున్న లోయర్, హయ్యర్ పరీక్షలకు హాల్ టిక్కెట్లు బుధవారం పంపిణీ చేశారు. ఇటీవల హాల్ టిక్కెట్లు తీసుకోని విద్యార్థులకు ఈ రోజు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. 100 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. కార్యక్రమంలో భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

నెల రోజులుగా పగలే వెలుగులు

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ పీఎం పాలెం చివరి బస్టాప్ వద్ద నెల రోజులుగా పగలు, రాత్రి అన్న తేడా లేకుండా విద్యుత్ దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. జీవీఎంసీ సిబ్బంది స్పందించి పగటి వేళ వీధి దీపాలు వెలగకుండా చేసి విద్యుత్ వృథాను అరికట్టాలి.

– ఎం.జగన్నాథరావు, పీఎం పాలెం.



పీఎం పాలెం చివరి బస్టాప్‌లో పగటివేళ వెలుగుతున్న లైట్లు

భర్తపై భార్య ఫిర్యాదు

మర్రిపాలెం: భర్త తనను వేధిస్తున్నాడంటూ ఓ భార్య కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. లంకా వసంత అనే మహిళకు ఆరేళ్ల కిందట వినయ్‌కుమార్‌తో వివాహం జరిగింది. వీరిద్దరూ కంచరపాలెంలో నివసించేవారు. వీరికి నాలుగేళ్ల కుమార్తె ఉంది. గత నాలుగేళ్లుగా భర్త వినయ్‌కుమార్ వివాహేతర సంబంధాలు పెట్టుకుని తనను వేధిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో కేసు దర్యాప్తు చేపట్టారు.

ఫిషింగ్ హార్బర్‌లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

మహారాణిపేట : ఫిషింగ్ హార్బర్‌లో ఉదయం వేళల్లో విపరీతమైన ట్రాఫిక్ రద్దీ కొనసాగుతోంది. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు చేపల వేలం పాట వద్ద రద్దీ వల్ల గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. దీని వల్ల మత్స్యకారులతో పాటు బోటు యాజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర మర పడవల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ స్పందన ద్వారా ఇటీవల కలెక్టర్ మల్లికార్జున దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ట్రాఫిక్ పోలీసులు హార్బర్‌లో పలు ప్రాంతాలను పరిశీలించారు. సమస్య పరిష్కారానికి అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. చేపల వేలం కేంద్రం వద్ద ఎక్కువగా ఆటోలు నిలుపుదల చేయటం వల్ల ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. విశాఖపట్నం ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ సమన్వయంతో పూర్తిస్థాయిలో ట్రాఫిక్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని ఏసీపీ రాజీవ్ కుమార్ హామీ ఇచ్చారని అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ తెలిపారు.

ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్‌కు సహకరిస్తాం



మేయర్ హరివెంకటకుమారిని సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అల్లిపురం: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్‌కు తమ వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. కొన్ని స్కూల్స్ మూతపడుతున్న సమయంలో అసోసియేషన్ చేసిన సేవలు తాను తెలుసుకున్నానని తెలిపారు. ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, మిడ్ డే మీల్స్ అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు కేఎస్ మూర్తి, రాజీవ్ విద్యా మిషన్ ప్రతినిధి బి.శ్రీనివాస్ పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్, కోశాధికారి మూర్తి, రాష్ట్ర నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.